## క్లుప్తంగా

### అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



చిన్నారికి అక్షరాభ్యాసం చేస్తున్న సర్పంచ్ కొడారు బాబు, సూపర్‌వైజర్, టీచర్

**చిలుకూరు :** చిలుకూరులోని అంగన్‌వాడీ కేంద్రం- 4లో శనివారం చిన్నారులకు అక్షరాభ్యాసం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొడారు బాబు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సునీత, గ్రామ కార్యదర్శి శోభన్‌బాబు, అంగన్‌వాడీ టీచర్ సిరికొండ కవిత, చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ముగిసిన కోదండరామస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

**గరిడేపల్లి :** మండలంలోని లాల్‌బహదూర్ (ఎల్‌బీనగర్) గ్రామంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీకోదండరామస్వామివారి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యావచనం, గోపూజ, బీజన్యాసం, కలాన్యాసం, కుంభదేను దర్శనం, పూర్ణాహుతి, మహదాశీర్వచనం అన్న ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సత్యనారాయణ శర్మ, కృష్ణశాస్త్రి, ఎంపీపీ పెండెం సుజాతాశ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ పోరెడ్డి శైలజ, సర్పంచ్ నలబోలు సక్కుబాయమ్మనారాయణరెడ్డి, ఎంపీటీసీ స్వప్న వెంకట్‌రెడ్డి, ఓజో ఫౌండేషన్ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

**గరిడేపల్లి :** అంగన్‌వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు యాకుబ్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం మండల కేంద్రంలో జరిగిన అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రగతి భవన్‌లో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. 2021లో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో స్వయంగా అంగన్‌వాడీలకు 30 శాతం పీఆర్‌సీ అమలు చేస్తామని, అంగన్‌వాడీలను పర్మినెంట్ చేస్తామని చెప్పి, నేడు మరిచారన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు సరిత, వెంకటమ్మ, లక్ష్మి, అశ్విని, జానకమ్మ, సువర్ణ, వరలక్ష్మి, శైలజ, నాగమ్మ తదితరులున్నారు.


### క్రీడా స్థలం ఏర్పాటు పనులు ప్రారంభం



ఆచార్యులగూడెంలో క్రీడా స్థలం ఏర్పాటు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రశాంతి

**చిలుకూరు :** క్రీడా స్థలం ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీపీ బండ్ల ప్రశాంతికోటయ్య అన్నారు. శనివారం మండలంలోని ఆచార్యులగూడెం జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడా స్థలం ఏర్పాటు పనులను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడా స్థలాన్ని యువకులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సారెడ్డి నర్సిరెడ్డి, ఎంపీఓ పాండు యాదవ్, పాఠశాల హెచ్‌ఎం జనార్దన్, ర్లో నిర్మల, ఈసీ మాధవి, టీఏ గిరిప్రసాద్, కార్యదర్శి రామారావు, గట్టు వీరయ్య, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### రూ.26 వేల వేతనం ఇవ్వాలి



కార్మికులతో మాట్లాడుతున్న కార్మిక సంఘం కన్వీనర్ వట్టెపు సైదులు

**మఠంపల్లి :** సిమెంట్ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు యాజమాన్యాలు, ప్రభుత్వం పరిష్కరించాలని సిమెంట్ పరిశ్రమ కార్మిక సంఘం క్లస్టర్ కన్వీనర్ వట్టెపు సైదులు కోరారు. శనివారం మండలంలోని పలు సిమెంట్ పరిశ్రమలలో కార్మికుల సమస్యలపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. రోజువారీ కూలి రూ.900, ఉచిత క్యాంటీన్, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్నియా, కార్మికులు రాము, వినోద్, వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, రామయ్య, కోటేశ్వరరావు, తదితరులున్నారు.

# సౌకర్యాలున్నా.. ప్రయోజనం సున్నా

**చిలుకూరులో నిరుపయోగంగా గోదాములు**
- రూ. 2.80 కోట్లతో నిర్మాణం
- ప్రారంభించి ఐదు నెలలు
- వినియోగంలోకి తీసుకురావాలని రైతుల వేడుకోలు



చిలుకూరులోని పలుకుబోడు భూమిలో నిరుపయోగంగా ఉన్న గోదాములు

**చిలుకూరు :** చిలుకూరులోని పలుకుబోడు భూమిలో నిర్మించిన నూతన గోదాములు నిరుపయోగంగా మారాయి. కోదాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ నుంచి మంజూరైన రూ. 2.80 కోట్ల నిధులతో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములను నిర్మించారు. కాగా, గోదాముల నిర్మాణాలు పూర్తయి మూడేళ్లు కావస్తున్న నేటికీ రైతులకు ఉపయోగంలోని రాలేదు. అయితే గోదాములు నిర్మించిన తర్వాత రెండేళ్లు వాటికి దారి సౌకర్యం లేదు. అయితే బేతవోలు రోడ్డు నుంచి కొంత దూరం దేవాలయ భూమి, ఆ తరువాత కొద్ది రైతుల భూమి ఉంది. దీంతో అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులతో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా బేతవోలు రోడ్డు నుంచి దారి ఏర్పాటు చేశారు. దీంతో గోదాములను ఐదు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ ప్రారంభించారు. అయినా అవి నేటికీ నిరుపయోగంగానే ఉంటున్నాయి.

**ఈ సీజన్‌లోనైనా ఉపయోగపడేనా..**

కాగా, రైతులు పండించిన ధాన్యాన్ని రైతులు బయట మార్కెట్‌లో దాచుకోవాలంటే గోదాముకు నెలకు బస్తాకు రూ.5 నుంచి 6 రూపాయలు ఖర్చు అవుతుంది. దీంతో రైతులు కిరాయిలు చెల్లించలేక పండించిన ధాన్యాన్ని వెంటనే కల్లాల వద్దనే అమ్ముకుంటున్నారు. దీని వలన రైతులు ఆర్థికంగా దెబ్బతింటున్నారు. అయితే ప్రభుత్వం నిర్మించిన గోదాములలో ఆరు నెలల పాటు ఉచితంగా ధాన్యం దాచుకోవచ్చు. ఆ తరువాత నిబంధనల ప్రకారం కొంత మేర డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. కావున ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు మేలు జరిగే ఈ గోదాములను కనీసం ఈ సీజన్‌లో అయినా ఉపయోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

**ఉపయోగంలోకి తీసుకురావాలి**



రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనం కోసం కోట్ల రూపాయలు వెచ్చించి గోదాములు ఏర్పాటు చేసింది. ఎమ్మెల్యే కృషితో వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. కానీ నేటి వరకు అధికారులు గోదాములను ఉపయోగంలోకి తీసుకురాలేదు. గోదాములు ఉపయోగంలోకి వస్తే రైతులకు చాలా మేలు జరుగుతుంది. రబీ సీజన్ వడ్లు మరో నెల రోజుల్లో వస్తాయి. కనుక ఈ రబీలో రైతులకు గోదాములు ఉపయోగపడేలా చూడాలి.

– కస్తూరి నర్సయ్య, డీఎల్‌డీప డైరెక్టర్, రైతు, చిలుకూరు

## మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం



చిలుకూరు : మాట్లాడుతున్న మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి

**చిలుకూరు :** మహిళకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరం మల్లేశ్వరి అన్నారు. శనివారం మండల కేంద్రంలో మహిళా సమాఖ్యా ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి మహిళలపై ఆర్థిక భారం మోపిందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రెమిడాల జయసుధ, సాతులూరి అలివేలు, నాయకురాళ్లు దొడ్డా సీతమ్మ, షేక్ మహిముదాభేగం, అంజమ్మ, పారత్వమ్మ, కౌసల్య, విజయలక్ష్మి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేయాలి



నినాదాలు చేస్తున్న మిర్యాలగూడ జిల్లా సాధన సమితి నాయకులు

**నేరేడుచర్ల :** మిర్యాలగూడను జిల్లాగా ఏర్పాటు చేసేంత వరకు ఉద్యమిస్తామని మిర్యాలగూడ జిల్లా సాధన సమితి నాయకులు డి.ధనుంజయనాయుడు, జ్వాల వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మిర్యాలగూడ, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్ నియోజకవర్గాలను కలిపి మిర్యాలగూడ కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేస్తే ప్రజలందరికి పరిపాలన సౌలభ్యంగా ఉంటుందన్నారు. మిర్యాలగూడ జిల్లా అయితే పారిశ్రామికంగా, విద్య, వైద్య పరంగా, వాణిజ్యపరంగా, వ్యాపార పరంగా అనుకూలంగా ఉంటుందన్నారు. ఈనెల 12వ తేదీన నేరేడుచర్లలో జరగనున్న మిర్యాలగూడ సాధన సమితి నేరేడుచర్ల, పాలకవీడు, గరిడేపల్లి మండలాల అఖిల పక్ష సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. వారి వెంట జిల్లా సాధన నాయకులు మురళి, మహిళా సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మి, చిలకరాజు శ్రీను, సత్యం, సింహాద్రి, శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్, తదితరులున్నారు.

## చిన్నపాటి నిర్లక్ష్యం ప్రమాదాలకు కారణం



మేళ్లచెరువు : రెయిన్ సిమెంట్ పరిశ్రమలో జెండా ఆవిష్కరిస్తున్న అధికారులు

**పాలకవీడు :** చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద ప్రమాదాలకు కారణమవుతుందని డెక్కన్ సిమెంట్ పరిశ్రమ చీఫ్ జనరల్ మేనేజర్ నాగమల్లేశ్వరరావు అన్నారు. శనివారం పాలకవీడు మండల పరిధిలోని డెక్కన్ పరిశ్రమ ఆధ్వర్యంలో నిర్వహించిన 52వ జాతీయ భద్రతా వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. పరిశ్రమలోని కార్మికులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం భద్రతా సేఫ్టీ ఫ్లాగ్ ఆవిష్కరించారు. తదనంతరం ప్రమాద రహితమే మన లక్ష్యం అనే నినాదాన్ని కార్మికులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో యాజమాన్యం, సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



పాలకవీడు : డెక్కన్ సిమెంట్ పరిశ్రమలో జెండా ఆవిష్కరిస్తున్న జీఎం నాగమల్లేశ్వరరావు

**మైహోం సిమెంట్ పరిశ్రమలో..**

**మేళ్లచెరువు :** మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమలో 52 జాతీయ భద్రతా వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పరిశ్రమలోని ఉద్యోగులు జీరో యాక్సిడెంట్ నివాదంతో పనిచేయాలని పరిశ్రమ హెడ్ శ్రీనివాసరావు సూచించారు. అంతకుముందు భద్రతా వారోత్సవాల జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేఫ్టీ డీజీఎం సూర్యనారాయణరాజు, జీఎం నాగేశ్వరరావు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

**రెయిన్ సిమెంట్ పరిశ్రమలో..**

మండలంలోని రెయిన్ సిమెంట్ పరిశ్రమలో శనివారం భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ జీఎం గురప్ప, మైన్స్ జీఎం శ్రీనివాసరెడ్డి, డీజీఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

**గరిడేపల్లి :** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు రాంబాబు గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కీతవారిగూడెంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రి వర్గ ఉప సంఘం విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలని సిఫారస్సు చేయడం హర్షనీయమని, ఈ విషయంపై సీఎం కేసీఆర్, ఆర్థిక, బీసీ శాఖ మంత్రులు హరీష్‌రావు, కమలాకర్ పునరాలోచన చేసి మెస్ చార్జీలు పెంచాలని కోరారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు నర్సింగ్ నాగేశ్వర్‌రావు, నలిగంటి శివ, శేఖర్, రమేష్ పాల్గొన్నారు.

### మల్లారెడ్డిగూడెం చరిత్ర మరువలేనిది

**హుజూర్‌నగర్ (చింతలపాలెం) :** రైతాంగ సాయుధ పోరాటంలో మల్లారెడ్డిగూడెం చరిత్ర మరువలేనిదని భారత కమ్యూనిస్టు పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ అన్నారు. శనివారం చింతలపాలెంలోని అమర వీరుల స్మారక స్థూపాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నిజాం మిలిటరీపై పోరాటంలో మల్లారెడ్డిగూడెం నాయకుల పాత్ర చరిత్రలో లిఖించదగినదన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చింతిరాల రవి, వెంకన్న, మధు పాల్గొన్నారు.

## ఘనంగా స్వపరిపాలన దినోత్సవం



పాలకవీడులోని జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వపరిపాలన దినోత్సవంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

**పాలకవీడు :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులుగా బాధ్యతలు నిర్వర్తించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలునాయక్, ఉపాధ్యాయులు ఉపేందర్, రామాంజనేయులు, స్వప్న, సైదులు, వెంకట్‌రెడ్డి, నాగరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.



మోతె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

**మోతె :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కార్యక్రమంలో హెచ్ఎం రామనర్సయ్య, ఉపాధ్యాయులు రామారావు, ఆనందకిశోర్, తదితరులు పాల్గొన్నారు.



నేరేడుచర్ల : శ్రీవాణి స్కూల్‌లో ప్రజాప్రతినిధుల వేషధారణలో విద్యార్థులు

**నేరేడుచర్ల :** మండల కేంద్రంలోని శ్రీవాణి పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొణతం సీతారాంరెడ్డి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఖానాపురంలో తాగునీటి తిప్పలు



నిరసన తెలుపుతున్న మహిళలు

**అనంతగిరి :** మండల పరిధిలోని ఖానాపురంలోని 3, 4వ వార్డుల్లో తాగునీరు, నిత్యావసరాలకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఖాళీ బిందెలతో శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతవారం రోజులుగా గ్రామ పంచాయతీ నీరు రావడం లేదని తెలిపారు. గ్రామంలో గత కొన్ని సంవత్సరాల క్రితం వేసిన పైప్‌లైన్‌లు పగిలిపోయాయని, అయినా గ్రామ పాలకవర్గం, అధికారులు పట్టించుకోవడం ఆరోపించారు. అంతేగాక డ్రెయినేజీ పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తాగు నీటి సమస్య పరిష్కరించాలని, డ్రెయినేజీ పూడిక తీయించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి షేక్ సుబాని, వార్డు సభ్యులు సుగుణ, వేణు, రామయ్య, తిరుపమ్మ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వ్యవస్థపై ఐఎస్ఎస్ బృందం సర్వే



నేరేడుచర్ల : బోడలదిన్నె చేరుకున్న ఐఎస్ఎస్ బృందం సభ్యులు, జెడ్పీ సీఈఓ సురేష్

**నేరేడుచర్ల :** గ్రామీణ వ్యవస్థపై సర్వే చేసేందుకు ఐఎస్ఎస్ బృందం శనివారం సాయంత్రం మండలంలోని బోడలదిన్నె గ్రామానికి చేరుకుంది. ఈ బృందంలో వసుమాన పుంజి(ఢిల్లీ), సుజాత ఘోష్(పశ్చిమ బెంగాల్), రంజనాశైనీ(ఢిల్లీ), నిహారిక సింగ్(ఉత్తరప్రదేశ్), హిమాన్షిత్రివేది(ఉత్తర ప్రదేశ్) ఐదుగురు సభ్యుల బృందం ఈ నెల 10వరకు గ్రామంలో సర్వే చేసేందుకు రాగా స్థానిక అధికారులు గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోడలదిన్నెతో పాటు కూడలి, బండ్లపల్లి, దేవుడిగట్టుతండ, ఎర్రారం గ్రామాల్లో కూడా బృందాలు సర్వే చేయనున్నట్లు తెలిపారు. వారం రోజుల పాటు సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లుతెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, తహసీల్దారు సరిత, ఎంపీడీఓ శంకరయ్య, ఎంపీఓ విజయకుమారి, ఎస్ఐ నవీన్‌కుమార్, రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రవీణ్‌కుమార్, గ్రామ వంగాల మాధవరెడ్డి, గ్రామ కార్యదర్శి వర్మా పాల్గొన్నారు.

**కూడలి గ్రామంలో పర్యటన**

**మోతె :** మండలంలో కూడలి గ్రామాన్ని ఐదుగురు సెంట్రల్ సివిల్ సర్వీసెస్ ట్రైనీ సభ్యుల బృందం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఎంపీడీఓ వెంకటాచారి, తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ హరిసింగ్‌నాయక్ స్వాగతం పలికారు. అనంతరం ట్రైనీ సభ్యులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి పథకాలు, గ్రామాల ఆర్థిక ప్రగతిపై 5 రోజుల సర్వే నిర్వహిస్తామన్నారు. సర్పంచ్ పి.నర్సింహారావు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఎర్రవరం సందర్శన**

**కోదాడరూరల్ :** మండల పరిధిలోని ఎర్రవరం గ్రామాన్ని శిక్షణలో ఉన్న ఇండియన్ స్టాటిస్టికల్ సర్వీసెస్(ఐఎస్ఎస్), ఇండియన్ ఎకనామిక్ సర్వీసెస్(ఐఈఎస్)లు శనివారం సందర్శించారు. గ్రామపంచాయతీలో జరిగే పనులను గ్రామాభివృద్ధి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై వారు ఈ నెల 10 వరకు గ్రామంలో పర్యటించనున్నారు. గ్రామాల్లో సేకరించిన సమాచారంపై వారు తుది పరీక్ష రాయాల్సి ఉంటుంది. వారి వెంట ఎంపీపీ చింత కవితారాధారెడ్డి, జెడ్పీటీసీ మందలపు కృష్ణకుమారి, సర్పంచ్ వీరేపల్లి సుబ్బారావు, తహసీల్దార్ శ్రీనివాసశర్మ, పీఏసీఎస్ చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, ఎంపీడీఓ విజయశ్రీ, ఎంపీఓ తుమ్మల నాగేశ్వరావు, ఎస్ఐ సాయిప్రశాంత్ ఉన్నారు.

## సీసీరెడ్డి పాఠశాలలో అ'పూర్వ' సమ్మేళనం



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

**కోదాడ :** పట్టణంలోని సీసీరెడ్డి పాఠశాలలో 2002– 03 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు శనివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 20 సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

# కల్యాణ మహోత్సవాలకు వేళాయే..

**దొండపాడు గ్రామంలో 6 నుంచి శ్రీతిరుపతమ్మ జాతర**
- 7న స్వామివారి కల్యాణం
- రాష్ట్ర స్థాయి ఎద్దుల పందేలు



దొండపాడులోని శ్రీ తిరుపతమ్మ దేవాలయం



ఆలయంలో కొలువైన తిరుపతమ్మ

**హుజూర్‌నగర్ (చింతలపాలెం) :** చింతలపాలెం మండలం దొండపాడులో శ్రీ తిరుపతమ్మ అమ్మవారి కల్యాణ (జాతర) మహోత్సవాలు ఈనెల 6వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఈ కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తిచేశారు. సోమవారం ఆలయంలో అమ్మవారికి అఖండ దీపారాధన, ప్రత్యేక కుంకుమార్చనతో ఉత్సవాలు ప్రారంభమౌతాయి. మంగళవారం పుట్టింటి పసుపు కుంకుమలను అమ్మవారికి సమర్పిస్తారు. అదేరోజు రాత్రి శ్రీగోపయ్య సమేత శ్రీ లక్ష్మితిరుపతమ్మ అమ్మవారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. బుధవారం ఉదయం నాగేంద్రస్వామికి పంచామృతాలతో అభిషేకం, సాయంత్రం రథోత్సవం, ఊరేగింపు నిర్వహించనున్నారు. గురువారం అమ్మవారికి జలాభిషేకం, ప్రత్యేక అలంకరణ, శుక్రవారం ఉదయం ప్రభోత్సవం, బోనాలు, మొక్కుల సమర్పణ, రాత్రి స్వామి, అమ్మవారికి పవళింపు సేవా తదితర పూజా కార్యక్రమాలు వైఖానస ఆగమ ప్రకారం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గున్నం రమాదేవినాగిరెడ్డి తెలిపారు.

**ఎద్దుల పందేలు, ముగ్గుల పోటీలు..**

శ్రీతిరుపతమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని 6వ తేదీ నుంచి 10 వరకు తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు నిర్వహించనున్నారు. అదేవిధంగా సూర్యాపేట, ఖమ్మం, కృష్ణా, గుంటూరు జిల్లాల స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు, కుర్చీ, రింగ్‌బాల్, త్రోబాల్ పోటీలను నిర్వహించనున్నారు అలాగే పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై తిరునాళ్ల మహోత్సవాలను తిలకించి, అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

## సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడుదాం

- డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మునగాల సీఐ ఆంజనేయులు

**మునగాల :** ప్రమాదంలో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కోదాడ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో డీజీపీ, జిల్లా ఎస్పీ ఆదేశానుసారం సీపీఆర్ (కారియో పల్మనరీ రిసెసిటేషన్) చేసే విధానంపై రాష్ట్ర రోడ్ సేఫ్టీ విభాగం, జీవీకే సంస్థ అత్యవసర విభాగం ఆధ్వర్యంలో మునగాల, నడిగూడెం, మోతె, కోదాడ రూరల్ పోలీసు స్టేషన్లకు చెందిన వాహన డ్రైవర్లు, ప్రైవేటు వాహనాల డ్రైవర్లు, యువత, పోలీసు సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎవరైన ప్రమాదాల బారిన పడి శ్వాస ఆడకుండా, గుండె కొట్టుకోకుండా ఉన్న సమయంలో అందుబాటులో ఉన్న వ్యక్తులు త్వరితగతిన స్పందించి క్షతగాత్రుడికి సీపీఆర్ చేయడం ద్వారా అతడి ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. అనంతరం తెలంగాణ పోలీసు రాష్ట్ర రోడ్డు సేఫ్టీ విభాగం డీఎస్పీ చంద్రభాను, జీవీకే సంస్థ అత్యవసర విభాగానికి చెందిన డా.మధుసూధన్, మునగాల సీఐ పి.ఆంజనేయులు సీపీఆర్ విధానాంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా వాహనాల డ్రైవర్లు, పోలీసు సిబ్బందికి సీపీఆర్ విధానంపై అవగాహన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఆయా మండలాల ఆటోడ్రైవర్లు, కోదాడ రూరల్ సీఐ పీఎన్‌డీ.ప్రసాద్, కోదాడ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు లోకేష్, నాగభూషణం, ఏడుకొండలు, సాయి ప్రశాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### విద్యార్థుల విద్యా ప్రగతిని పెంపొందించాలి

**మోతె :** పది విద్యార్థుల విద్యా ప్రగతిని పెంపొందించాలని మండల విద్యాధికారి కె.గోపాల్‌రావు అన్నారు. శనివారం మండల పరిధిలోని మామిళ్లగూడెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విద్యా ప్రగతి మోటివేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పదవ వతరగతి విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంపొందించుటకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### దరఖాస్తుదారులందరికీ హక్కు పత్రాలివ్వాలి

**మఠంపల్లి :** జిల్లాలో 4,200ల మంది గిరిజనులు అటవీ భూములలో పోడు వ్యవసాయం చేస్తూ హక్కు పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారందరికీ అటవీ హక్కు చట్టం ప్రకారం హక్కు పత్రాలు ఇవ్వాలని గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధీరావత్ రవినాయక్ కోరారు. శనివారం ఆయన మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా పోడుభూములు హక్కుల కోసం 10 వేల మంది గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారని కానీ జిల్లా స్థాయి కమిటీ, ఎస్డీఎల్‌సీ తీర్మానంలో కేవలం 33 ఎకరాలకు గాను 84 మందిని మాత్రమే అర్హులుగా గుర్తించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్, రాష్ట్ర నాయకులు భూక్యా పాండు నాయక్, జిల్లా నాయకులు రత్నావత్ వినోద్ నాయక్ ఉన్నారు.

### పెంచిన గ్యాస్ రేట్లు తగ్గించాలి

**హుజూర్‌నగర్ :** కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ సిలిండర్ రేట్లు తగ్గించాలని బీఆర్ఎస్‌కేవీ నాయకులు పి.ఉపేందర్ డిమాండ్ చేశారు. గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకిస్తూ శనివారం హుజూర్‌నగర్ పట్టణంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కేవీ నాయకులు, కార్మికులు బాలకృష్ణ, శ్రీను, నరసింహారావు, వెంకన్న, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.